యూరో కిడ్స్ ప్రీ స్కూల్ ప్రారంభం


యూరో కిడ్స్ ప్రీ స్కూల్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు

అల్వాల్: అల్వాల్ ప్రశాంత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన యూరో కిడ్స్ ప్రీ స్కూల్‌ను సోమవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ బండి అక్షితరెడ్డి హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో బండి రామిరెడ్డి, శ్రీకర్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి, స్థానిక నాయకులు చంద్రశేఖర్, నక్క ప్రభాకర్‌గౌడ్, యాదగిరి, సురేందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, బలవంతరెడ్డి, రాజసింహారెడ్డి, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గోశాల నిర్మాణానికి స్థలం కేటాయించాలి

ఉప్పల్: తపస్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరుతూ సోమవారం బీఆర్‌ఎస్ నేత బన్నాల ప్రవీణ్ ఆధ్వర్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తపస్య ఫౌండేషన్ ప్రతినిధులు ఆచార్య వేద సింధు, బొల్లా విజయ్‌కుమార్ తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో మహేందర్ జైస్వాల్, పత్తి పాక లక్ష్మణ్, గంగాధర్ మహాజన్ తదితరులు ఉన్నారు.

మహిళలు స్వయం ఉపాధి సాధించాలి


కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

రామంతాపూర్: ఓల్డ్ రామంతాపూర్‌లోని అంబేద్కర్ కమిటీ హాల్‌లో సోమవారం వనిత జీవన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ కేంద్రాన్ని కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు ప్రారంభించారు. మహిళలు తమ ఇంటి వద్దే స్వయం ఉపాధిని చేపట్టి మరో 10 మంది మహిళలకు ఉపాధి కల్పించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు ఆకుల సుభాషిని, అంబేద్కర్ సంఘం ప్రతినిధులు జంగయ్య, బొడ్డుపల్లి ఆనంద్, కొంగర శ్రీనివాస్, నిరంజన్‌గౌడ్, అంజయ్య, మల్లికార్జున్, లత తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ..


కుషాయిగూడ జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ జిల్లా పరిషత్ పాఠశాలలో 2007–2008 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ప్రధానోపాధ్యాయులు నర్సింహారెడ్డి, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు పాపిరెడ్డి హాజరై నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం, మానసిక ఆనందం



మేడిపల్లి: క్రీడలతో మానసిక ప్రశాంతత పెంపొందించుకోవచ్చని కార్ల్ బ్యాడ్మింటన్ అకాడమీ నిర్వాహకులు మధు, అవినాష్ అన్నారు. ఈ మేరకు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ పరిధిలో సాయిహిల్స్ కాలనీలోని కార్ల్ బ్యాడ్మింటన్ అకాడమీలో సోమవారం నిర్వహించిన ఉదయం ఫ్రెండ్స్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగింది. పురుషుల సీనియర్స్ డబుల్స్ విభాగం, జూనియర్స్ జట్ల క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విజేతలకు ట్రోఫీలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రవికుమార్, నర్సింహ, కుమారస్వామి, శ్రీనివాస్, డి.నర్సయ్యగౌడ్, రంగారెడ్డి, మహేందర్‌రెడ్డి, శశాంక్ రెడ్డి, చంద్రమోహన్, జగదీష్, అంకిత్ తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ మార్చ్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



కాప్రా: నీట్ పరీక్ష నిర్వహణలో విఫలం చెంది, పరీక్ష ఫలితాల్లో లీకేజీలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యప్రసాద్ డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన స్టూడెంట్ మార్చ్ వాల్‌పోస్టర్‌ను సోమవారం ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యాప్రసాద్ మాట్లాడుతూ నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలన్నారు. నీట్ లీకేజీపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్ నుంచి లిబర్టీ అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతలు గిరిబాబు, శేఖర్, మధు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం


జమాల్(ఫైల్)

అల్వాల్: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ సఫిల్‌గూడ లక్ష్మీనగర్‌కు చెందిన జమాల్(92) మానసిక స్థితి బాగా లేదు. సోమవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


వెంకటాపురంలో..


ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్‌లో సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

ఈద్ ముబారక్

బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం పూట నమాజ్ చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్, కాప్రా ఈద్గాలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. - ఉప్పల్, మల్కాజిగిరి జోన్ బృందం


బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎండీ ఉస్మాన్




కాప్రా ఈద్గాలో సాముహిక ప్రార్థనల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రాజకీయాలకతీతంగా అభివృద్ధి

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి


కాలనీల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని సత్యానగర్, రవీందర్‌నగర్, లక్ష్మీకాంతనగర్, శ్రీనగర్‌కాలనీల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నేతలతో కలిసి విస్తృతంగా పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్త కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా వంటి కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నామని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని, అదేవిధంగా రామంతాపూర్‌లోని కొత్త బస్తీలు, కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు త్వరలో అధికారులతో కలిసి విస్తృత సమావేశం నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, సూరం శంకర్, ప్రశాంత్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, విజయలక్ష్మి, మధు, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



బోడుప్పల్: భక్తుల కోరికలు తీర్చే అమ్మవారుగా శ్రీమాతా నిమిషాంబదేవి అమ్మవారు పేరొందారని ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్‌కుమార్ అన్నారు. పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబదేవి అష్టాదశ 18వ వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలు దైవ చింతన కలిగి ఉండాలని, సమాజ హితం కోసం బతకాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన పుణ్యాహవచనం, మండప దేవతా పూజలు, మూలమంత్ర హవనం, శ్రీచక్రార్చన, నక్షత్ర నవగ్రహ పాశుపత హోమం, సామూహిక చండీ హోమం, నరదృష్టి నివారణకు శక్తిహోమం, మహాలక్ష్మి అనుగ్రహనార్థం హోమం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు అశోక్‌కుమార్, శ్రీనివాస్, కోశాధికారి రమేష్, ట్రస్ట్ ధర్మకర్త కొరిచర్ల శ్రీనివాస్‌రావు, ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ భక్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బోడుప్పల్: సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని 24వ డివిజన్ కార్పొరేటర్ గుర్రాల రమా వెంకటేశ్ యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలో సోమవారం ఆమె పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్యోతినగర్ కాలనీలో కరెంట్ సమస్యలు, సీసీ రోడ్డు సమస్యలున్నాయని కాలనీవాసులు తమ దృష్టికి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు వేగంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుర్రాల వెంకటేశ్ యాదవ్, ముద్దం రాంచందర్, శివగౌడ్, జైపాల్‌రెడ్డి, రమణా రావు, యాదయ్య పాల్గొన్నారు.

మొబైల్ షాపు నిర్వాహకుడిపై దాడి

పలువురిపై కేసు నమోదు

మల్లాపూర్: మొబైల్ షాప్ నిర్వాహకుడిపై కొంత మంది దాడి చేసిన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాచారం రాఘవేంద్రనగర్‌కు చెందిన పెద్దమ్మ రాజు(42) మల్లాపూర్‌లో గణపతి మొబైల్ షాపు నడుపుతున్నాడు. ఆదివారం రాత్రి మొబైల్ బిల్లు విషయంలో కస్టమర్‌తో గొడవ జరిగింది. మహేష్, శ్రవణ్, మనీష్, సురేష్, అజయ్‌లు కలిసి మొబైల్ షాపు నిర్వాహకుడు రాజుపై దాడి చేశారు. దీంతో రాజుకు గాయాలయ్యాయి. అతడి ఫిర్యాదు మేరకు నాచారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తా


సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

మల్కాజిగిరి: మల్కాజిగిరి ఎంపీగా గెలిపించిన ప్రజలకు అండగా ఉంటానని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఎంపీగా గెలిచిన తర్వాత మొదటిసారి మల్కాజిగిరిలో సఫిల్‌గూడ మినీట్యాంక్ బండ్‌ను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్, అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అభినందనలు తెలిపి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అనుగుణంగా ప్రభుత్వ పనితీరు ఉండాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రులతో సైతం కొట్లాడిన సంఘటనలు ఉన్నాయన్నారు. చెరువులు ఒకప్పుడు కలుషితం లేకుండా అందరికీ ఉపయోగకరంగా ఉండేవని, ఇప్పుడు మళ్లీ ఆ పరిస్థితులు రావాలన్నారు. ఆనంద్‌బాగ్ ప్రాంతంలో ఎంఎంటీఎస్ రైల్వే స్టాపింగ్ కోసం చర్యలు తీసుకోవాలని కోరుతూ మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు, కార్పొరేటర్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మొదటిసారి మల్కాజిగిరికి వచ్చిన ఈటల రాజేందర్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

నాణ్యత పాటించకపోతే కాంట్రాక్టర్లపై చర్యలు


ఉప్పల్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రజిత తదితరులు

ఉప్పల్: ఉప్పల్ డివిజన్‌లో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి సోమవారం అధికారులతో కలిసి పర్యటించారు. కుమ్మరిబస్తీలో రూ.30 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లేకపోతే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం కాలనీల్లో నెలకొన్న వివిధ సమస్యలను కాలనీ అసోసియేషన్ల నాయకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గుమ్మడెల్లి శంకరయ్య, కృష్ణ, బుల్లెట్ కృష్ణ, మీనంపల్లి ఆండాలు, సల్ల ప్రభాకర్‌రెడ్డి, మాశెట్టి రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐలో యూనియన్ ఆవిర్భావ వేడుకలు


నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో యూనియన్ ఆవిర్భావ వేడుకల్లో ఉద్యోగులు

మల్లాపూర్: తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఇప్పటి వరకు యూనియన్ చేపట్టిన పోరాటాలు, ఉద్యమాలను గుర్తుచేశారు. ఉద్యోగుల హక్కుల సాధనం కోసం తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ విజయాలు సాధించిందన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ భాగ్యలక్ష్మి, హెడ్‌నర్సు రాజమణి, ఈఎస్ఐ బ్రాంచ్ సెక్రటరీ వేణుకుమార్, ధన్‌రాం, భాగ్య, సౌందర్య, బాకేశ్వరీ, జామియా, కుమార్, రాఘవేంద్రర్, అరుణ, ఈఎస్ఐ ఆస్పత్రి సిబ్బంది, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వరాలయ వార్షికోత్సవం



మల్కాజిగిరి: మల్కాజిగిరి గీతానగర్‌లోని శారదాచంద్ర మౌళీశ్వరాలయం 18వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఉదయం గోపూజ అనంతరం, మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకం, అలంకరణ, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.

DOCUMENT LOST

I, Pocharam Buchi Reddy, S/o Pocharam Laxma Reddy, Aged about 61 years, Occ: Business, R/o. Ramanthapur, Hyderabad-13 do here by solemnly affirm and state as that on 02/06/24 while travelling to uppal i found that i lost a file containing Original Sale Deed No.1152/2003 Regd at SRO, Uppal inspite of my best efforts, not able to trace it and it is lost beyond recovery. Hence i request the concerned authorities after enquiry issue me certificate which will be helpful for further procedures. The above facts are true to best of my knowledge & belief. If any please call: 9505852201

కుంటలనుకుంటే పొరపాటే..


రామంతాపూర్ గోకుల్‌నగర్‌లో రోడ్లపై నిలిచిన వరద నీరు


ఉప్పల్ భగాయత్, డీమార్ట్ ఎదురుగా..


ఇందిరానగర్ సత్యదేవుని ఆలయం వద్ద..

వరదతో అస్తవ్యస్తంగా మారుతున్న రోడ్లు

- రామంతాపూర్‌లోని పలు కాలనీల్లో దుస్థితి
- అవుట్‌లెట్లు లేక రోడ్లపై నిలుస్తున్న వరద
- నీటి కాల్వలు నిర్మించినా ఫలితం శూన్యం
- మోటార్లతో తోడేయాలంటున్న స్థానికులు
- శాశ్వత పరిష్కారం చూపాలంటూ వేడుకోలు

రామంతాపూర్: చిన్నపాటి వర్షానికే రామంతాపూర్ పరిధిలోని ప్రధాన, అంతర్గత రోడ్లు, లోతట్టు ప్రాంతాలన్నీ కుంటలు, చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. దానికి తోడు భూగర్భ డ్రైనేజీ పొంగి రోడ్లపై పారుతుండటంతో పాదచారులు అడుగు వేయాలంటే నరకం అనుభవిస్తున్నారు. పరిష్కారం చూపాలంటూ ప్రతి వర్షాకాలం ప్రజాప్రతినిధులు, అధికారులను వేడుకుంటున్నారు. అయినా పరిస్థితిలో ఏ మాత్రం మార్పు కనిపించడం లేదు.

- గోఖలేనగర్, నాగసాయి అపార్టుమెంట్, వాటర్ వర్క్స్ ఎదురుగా వరద నీరు సాఫీగా వెళ్లేందుకు అవుట్‌లెట్ లేకపోవడంతో ఆ ప్రాంతం చిన్నపాటి చెరువును తలపిస్తోంది. ఇందిరానగర్ సత్యదేవుని ఆలయం వద్ద లోతట్టుగా ఉండటంతో రోడ్డుపైనే మురుగు, వరద చేరుతోంది. రామంతాపూర్ బైపాస్ రోడ్డు నుంచి నాగోల్‌కు వెళ్లే దారిలోని టీవీ కాలనీ వద్ద ఈ రోడ్డు చిన్నపాటి చెరువులా తయారవుతోంది. ఉప్పల్ భగాయత్ హెచ్‌ఎండీఏ లేఅవుట్ డీమార్ట్ ఎదురుగా ఉన్న రోడ్డు చిన్న వర్షానికే కుంటలా మారుతోంది.
- హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ పక్కన గల సాయి చిత్రానగర్ రోడ్డు దుస్థితి కూడా ఇలాగే ఉంది. వర్షం పడితే చాలు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, సెయింట్ జోసెఫ్ స్కూల్ తదితర విద్యా సంస్థలకు వెళ్లే విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు.
- ప్రధాన రహదారిలోని హోమియోపతి ఆస్పత్రి నుంచి నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ రోడ్డు మధ్యలో వర్షం వచ్చినప్పుడల్లా చిన్న చెరువులా తయారవుతోంది. ఇది ప్రధాన రహదారి కావడంతో వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పరిస్థితిని గతేడాది గుర్తించిన జీహెచ్‌ఎంసీ అధికారులు ఇప్పటి వరకు సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా అంతర్గత బస్తీలు, కాలనీల్లో వరద సాఫీగా వెళ్లేందుకు నిర్మించిన వరద నీటి కాల్వలో కొంతమంది భూగర్భ డ్రైనేజీ కనెక్షన్లు కలపడంతో వరద నీరు ఆ నాలాలోకి వెళ్లకుండా రోడ్లపైనే నిలుస్తోంది.


బైపాస్‌రోడ్డు టీవీ కాలనీలో..

అవుట్ లెట్లు లేకపోవడం వల్లే..



చిన్నపాటి వర్షం కురిసినా రామంతాపూర్ పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాల్లో రోడ్లు చెరువుల్లా మారిపోతున్నాయి. పెద్ద వర్షం వస్తే పరిస్థితి చాలా ఇబ్బందికరంగా మారుతోంది. వరద సాఫీగా వెళ్లేందుకు అవుట్ లెట్లు లేకపోవడంతో రోడ్లు.. చెరువులా అనే విధంగా మారుతోంది. లక్షల రూపాయలు ఖర్చు చేసి వరద నీటి కాల్వలు నిర్మించినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. వరద నీరు సాఫీగా వెళ్లేందుకు ఈ కాల్వలను సరైన పద్ధతిలో నిర్మించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ వర్షాకాలంలో భారీ వర్షాలు వచ్చినప్పుడు వెంట వెంటనే మోటార్లతో తోడే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

– నాను సతీష్, ఆర్టీసీ కాలనీ, రామంతాపూర్

నేడు రైతు నేస్తం కార్యక్రమం

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి రైతు వేదిక వద్ద రైతు నేస్తం (వీడియో కాన్ఫరెన్స్) కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి కృష్ణవేణి తెలిపారు. వానాకాలం వరి సాగు గురించి ఉత్తమ రైతులు, శాస్త్రవేత్తలు సాగు మెలకువల గురించి వివరిస్తారన్నారు. మండలంలో రైతులు పాల్గొన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

కబ్జాదారునిపై కేసు నమోదు

పోచారం: ఖాళీ స్థలాన్ని కబ్జాచేసిన వ్యక్తిపై పోచారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ రాజు తెలిపిన మేరకు.. అన్నోజిగూడలోని సత్యసాయినగర్ సర్వే నెంబర్ 44లో 100 చదరపు గజాల స్థలాన్ని బోడుప్పల్ కార్పొరేషన్‌లోని దేవేందర్‌నగర్‌కు చెందిన బండ శ్యామల లత 2013లో కొనుగోలు చేశారు. అయితే పక్క ప్లాటు యజమాని సురేష్ తన ప్లాటులో 60 చదరపు గజాల స్థలాన్ని కబ్జాచేసి నాలుగు అంతస్తుల భవనం నిర్మిస్తున్నాడు. తన ప్లాటును ఎందుకు ఆక్రమించారని అడిగితే 'అలాగే ఆక్రమించి కట్టుకుంటా. ఏమి చేస్తావ్.. ఎవరితో చెప్పుకుంటావ్' అని బెదిరించాడని పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

కాలనీల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు

కీసర: నాగారం మున్సిపల్‌పరిధిలోని వివిధ కాలనీల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడతామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని సత్యనారాయణకాలనీలో కాలనీ నూతన భవన నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కాలనీల్లో అసోషియేషన్ ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి పనులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.సత్యనారాయణ దేవస్థానం చైర్మెన్ అన్నంరాజు శ్రీనివాస్, సత్యనారాయణ కాలనీ అసోషియేషన్ అధ్యక్షుడు మధుసుధన్‌రెడ్డి పాల్గొన్నారు.